www.prajasakti.com

# ప్రజాశక్తి

ఆదివారం 14 సెప్టెంబరు 2025 5

ఏలూరు

## బస్సులు లేక శ్రీవారి యాత్రికుల అవస్థలు

బస్సుల కోసం చూస్తున్న యాత్రికులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి శనివారం పెద్దఎత్తున యాత్రికులు తరలివచ్చారు. తిరుగు ప్రయాణంలో బస్సులు సరిపోక తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షం వల్ల బస్టాండ్‌లో యాత్రికులు నిల్చునేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుడిసెంటర్, స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాశారు. రాత్రి తొమ్మిది గంటలైనా బస్టాండ్‌లో యాత్రికులు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్‌టిసి అధికారులు ప్రయాణికుల ఇబ్బందులు అర్థం చేసుకుని శని, ఆదివారాల్లో బస్సుల సంఖ్య పెంచి ఇబ్బందుల్లేకుండా చూడాలని యాత్రికులు కోరుతున్నారు.

## నేవీ ఆయుధ డిపోపై
# కొత్త నాటకం..!

డిపో ఏర్పాటుతో పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయని కొత్త ఎత్తుగడ

ప్రాజెక్టు నిర్మాణంలో స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి దక్కిందా

నిర్వాసితులకు ఇప్పటికీ అందని పరిహారం

మాటలకు, చేతలకు పొంతన లేదని

పోలవరం ప్రాజెక్టులోనే నిర్ధారణ

'పోలవరం' భూసేకరణలో గ్రామసభలు జరపకుండా అడ్డగోలుగా తీర్మానాలు

ఆయుధ డిపో ఏర్పాటులోనూ అలాగే వెళ్లేందుకు యత్నిస్తున్నారని చర్చ

ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు 16న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై అధికారులు, ప్రజాప్రతినిధులు కొత్త నాటకానికి తెర లేపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమాయక గిరిజనులను ఏమార్చేందుకు ఉద్యోగాలు పెద్దఎత్తున వస్తాయని కొత్త ఎత్తుగడ వేస్తున్నారనే చర్చ సాగుతోంది. నేవీ ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ మూడుసార్లు గ్రామసభ తీర్మానం చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు మొండిగా ముందుకు సాగడం వెనుక ఏదో గూడుపుఠాణి జరుగుతుందనే చర్చ ఏజెన్సీ ప్రజల్లో నెలకొంది. జీలుగుమిల్లి మండలంలోని వంకావారి గూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం ఐదు గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో నిర్మించాలని మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏజెన్సీలో గిరిజనుల భూములను లాక్కుంటూ, జనాన్ని ఇబ్బంది పెడుతూ ఆయుధ డిపో ఎందుకు నిర్మించాలనుకుంటున్నారనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా ఆదిలో ఏవైతే మాటలు చెప్పారో అవే మాటలను ఇప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులు వల్లించడం చూసి అంతా విస్తుపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదన తరుణంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో లక్షకుపైగా కుటుంబాలను తరలించాలని లెక్కగట్టారు. వందల సంఖ్యలో గ్రామాలను ఖాళీ చేయించాలని తేలింది. దీనిపై గిరిజనులు ఎదురుతిరిగారు. దీంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పెద్దఎత్తున స్థానికులకు ఉపాధి దొరుకుతుందని, నిర్వాసితుల్లో కుటుంబానికి ఒక ఉద్యోగం సైతం కల్పిస్తామని, పరిహారం పూర్తిస్థాయిలో అందించిన తర్వాతే ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని నమ్మబలికారు. గడిచిన పదేళ్లుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాగుతోంది. ఆ నిర్మాణంలో ఒక్క స్థానికుడూ ఉపాధి పొందలేదంటే అతిశయోక్తి కాదు. అక్కడ పని చేసేవారంతా ఒడిశా, ఉత్తరప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలకు చెందినవారే. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండానే ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు ముందుకు సాగుతున్నారు. ఇప్పటికీ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 20 వేల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. భూమికి భూమిగాని, ఇళ్లకు పరిహారంగాని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఏఒక్కటీ ఇవ్వలేదు. నిర్మించిన కాలనీల్లోనూ మౌలిక వసతులు కల్పించకపోవడంతో తరలొచ్చిన నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాసితుల కుటుంబాల్లో ఒక్కరికీ కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేదు. ఇప్పటికీ వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ప్రతియేటా వరదలకు కట్టుబట్టలతో కొండలు, గుట్టలపైనే కాలం వెళ్లదీయాల్సిన దుర్భర పరిస్థితి ఉంది. నేవీ ఆయుధ డిపోకు 1,166 ఎకరాలను సేకరించేందుకు చూస్తున్నారు. భూములన్నీ తీసేసుకుంటే గిరిజనులు ఏవిధంగా బతకాలి. పొలాల్లో పనులు లేక ఉపాధి సైతం పోతుంది. రక్షణ శాఖకు సంబంధించిన ఆయుధ డిపో వస్తే సవాలక్ష ఆంక్షలు తెరపైకి వస్తాయి. అప్పుడు ఈ ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరైనా సమాధానం చెబుతారా అంటే కంటికి కూడా కనిపించని పరిస్థితి ఉంటుంది. వేరే ప్రాంతాల్లో తిరస్కరించిన నేవీ ఆయుధ డిపోను బలవంతంగా ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు. ఆయుధ డిపో ఏర్పాటులో ప్రజలకు వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు అంతటా చర్చనీయాంశంగా మారింది.

### ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోం

**కె.రవికుమార్, కొత్త సీమలవారిగూడెం పీసా కమిటీ కార్యదర్శి**

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై గతంలోనే గ్రామసభ అనేకసార్లు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. అయినప్పటికీ మళ్లీ తెరపైకి తీసుకురావడం దారుణం. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు ఆయుధ డిపో ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం. మరోసారి వ్యతిరేకంగా తీర్మానం చేస్తాం. అవసరమైతే ఆందోళనలు, పోరాటాలు సాగిస్తాం.

### అడ్డగోలు తీర్మానాలతో ముందుకెళ్లే యోచనలో ఉన్నట్లు చర్చ

గతంలో మూడుసార్లు ఆయుధ డిపోకు వ్యతిరేకంగా గ్రామసభ తీర్మానం చేసింది. అయినప్పటికీ ఇప్పుడు మళ్లీ తెరపైకి తేవడం వెనుక పెద్ద కుట్ర జరుగుతున్నట్లు స్థానికుల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం పోలవరం నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూసేకరణ జరుగుతోంది. గిరిజనుల భూములను గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దీన్ని గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో రెడ్డిగణపవరం రెవెన్యూ పరిధిలోని భూములకు సంబంధించి వేరే గ్రామంలోని పీసా కమిటీతో తీర్మానాలు చేయించి అడ్డగోలుగా ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా ఆయుధ డిపోకు సంబంధించి అడ్డగోలు తీర్మానాలు చేసేందుకు వ్యూహాలు రచించినట్లు అందరిలోనూ చర్చ సాగుతోంది. అదే జరిగితే ప్రతిఘటన తప్పదని గిరిజనులు, గిరిజన నాయకులు హెచ్చరిస్తున్నారు. ఆయుధ డిపో ఏర్పాటు ప్రకటన నేపథ్యంలో ఈ నెల 16న జీలుగుమిల్లి మండలంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గతంలో ఆయుధ డిపోను స్థానిక టిడిపి నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పుడు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

### ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు పని చేస్తున్నారు

**తెల్లం రామకృష్ణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు**

ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు ముందుకు సాగడం దుర్మార్గం. ఇదంతా కావాలనే చేస్తున్నారు. ఆయుధ డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామస్తులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతాం. దీనికి సంబంధించి ముందుగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తాం.

# మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ఉత్సాహంగా సిఐటియు 13వ జిల్లా మహాసభ ప్రారంభం

ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు 13వ జిల్లా మహాసభ శనివారం నూజివీడు పట్టణంలో ఆర్.సత్యనారాయణరాజు నగర్‌లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. తొలుత సిఐటియు పతాకాన్ని సీనియర్ నాయకులు ఎన్.హనుమాన్లు ఆవిష్కరించారు. అనంతరం మహాసభ అధ్యక్షవర్గం, మినిట్స్, తీర్మానాల కమిటీలను ఎన్నుకున్నారు. ఆర్.లింగరాజు, ఆర్‌విఎస్.నారాయణ, పి.భారతి, కనకారావు, కమల అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సంతాప తీర్మానాన్ని జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రవేశపెట్టగా మృతులకు మహాసభ నివాళులర్పించింది. ప్రారంభ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను, ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన అనేక హామీలు అధికారం చేపట్టి ఏడాది దాటినా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. విద్య, వైద్యంలను పేదలకు అందకుండా చేసేలా రాష్ట్ర మంత్రివర్గంలో తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికులు మరింత సంఘటితంగా, ఐక్యతతో ఉద్యమిస్తేనే ప్రయివేటీకరణ విధానాలను తిప్పికొట్టగమని, దానికి కార్మిక లోకం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్‌లో తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం మినహా మరేవీ అమలు కాలేదన్నారు. ఎన్నికల ముందు యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.మూడు వేల నిరుద్యోగ భృతి, 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 వంటి హామీలేవీ అమలు కాలేదన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలంటే రూ.నాలుగు వేల కోట్లు అవసరమవ్వగా కేవలం రూ.895 కోట్లు మాత్రమే కేటాయించారని, అంటే సంవత్సరానికి ఒక సిలిండర్‌కు మాత్రమే పరిమితం చేశారని అన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ఇంటి పన్ను సమీక్షిస్తామని, చదువుల కోసం వడ్డీ లేని రుణాలు, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణం, బిసిలకు 50 ఏళ్లకే పెన్షన్, ఏజెన్సీ ప్రాంతంలో జిఒ నెం.3 అమలు వంటివన్నీ గాలిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు, నూజివీడు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పెనుకొండ రామారావు మాట్లాడుతూ సిఐటియు మహాసభ నూజివీడులో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కేవలం కార్మిక సమస్యలపైనే కాకుండా ప్రజా సమస్యలపైనా సిఐటియు ఉద్యమించడం అభినందనీయమన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డివిఎన్‌విడి.ప్రసాద్ కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టారు. సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా కార్యదర్శులు జి.రాజు, మొడియం నాగమణి, ప్రసాద్, ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, పోశమ్మ, నాయకులు రాజులపాటి చంటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామారావు



జెండా ఆవిష్కరిస్తున్న సీనియర్ నేత ఎన్.హనుమాన్లు; ఆర్‌ఎస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రాయ్; మాట్లాడుతున్న డివిఎన్‌విడి.ప్రసాద్

# నేవీ ఆయుధ డిపో ఏర్పాటును విరమించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటును విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జీలుగుమిల్లి మండల కమిటీ సమావేశం తెల్లం శంకరుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఇప్పటికే అనేక మార్లు గ్రామ సభలు తిరస్కరించినా ఆయుధ కర్మాగారాన్ని ఎంపీ, ఎంఎల్‌ఎ తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం గిరిజన ప్రాంతానికి, గిరిజన చట్టానికి అన్యాయం చేయడమేనని విమర్శించారు. ఇప్పటికే అనేకమార్లు ఆయుధ కర్మాగారం వద్దంటూ తీర్మానాలు చేశారని, నాటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ గిరిజన వ్యతిరేక ఆమోదాన్ని అంగీకరిస్తూ ఆయుధ కర్మాగార నిర్మాణ వ్యవహారాన్ని పక్కన పెట్టారని, ఇప్పుడు మళ్లీ కాసులకు కక్కుర్తి పడి ప్రజా ప్రతినిధులు ఆయుధ డిపో తెచ్చేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నారని, తక్షణమే గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా నిర్మించాలని చూస్తున్న ఆయుధ డిపో ఏర్పాటును విడనాడాలని, బలవంతంగా తీసుకొచ్చి పెడతామంటే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. అనంతరం సెక్రటేరియట్ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన చట్టాలకు, సంస్కృతి సాంప్రదాయాలకు వ్యతిరేకంగా ఓ పక్కన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పేరుతో, మరో పక్కన చింతలపూడి ఎత్తిపోతల పథకం పేరుతో, ఇప్పుడు ఆయుధ కర్మాగారం పేరుతో గిరిజన ప్రాంతాన్ని దహించి వేస్తున్నారన్నారు. గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. దీనిని గిరిజన సమాజం ఏ మాత్రం సహించదని, తక్షణమే ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకుని ఆయుధ కార్మాగార ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సిరిబత్తుల సీతారామయ్య, కారం దుర్గమ్మ, బోడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# పెదవాగు ప్రాజెక్టుకు వరద పోటు

15 గ్రామాలకు పొంచి ఉన్న ప్రమాదం

గతేడాది జులైలో పెదవాగు ప్రాజెక్టుకు గండి పడి నిరాశ్రయులైన రెండు వేల కుటుంబాలు

ఇప్పటికీ ప్రాజెక్టు పనులు పూర్తి చేయని పరిస్థితి

వరద నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు

పెదవాగుకు వస్తున్న వరద నీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, వేలేరుపాడు

తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో పెదవాగు ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతుంది. దీంతో వేలేరుపాడు మండలంలోని 15 గ్రామాల ప్రజల్లో తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. వరద నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమై అక్కడ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సన్నద్ధమవుతున్నారు. పెదవాగు ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలంలోని గుమ్మడిపల్లి ప్రాంతంలో ఉంది. ప్రాజెక్టు తెలంగాణ భూభాగంలో ఉన్నప్పటికీ ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు మండలంలో సాగు ఆయకట్టు ఎక్కువగా ఉంది. 2024 జులైలో పెదవాగు ప్రాజెక్టుకు భారీ వరద పోటెత్తడంతో ప్రాజెక్టు గండి పడింది. దీంతో వేలేరుపాడు మండలంలోని అల్లూరినగర్, కోయ మాధవరం, మద్దిగట్ల వంటి మొత్తం 15 గ్రామాలు రాత్రికి రాత్రి మునిగిపోయాయి. దీంతో రెండువేల కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. ఒక్క అల్లూరి నగర్‌లోనే 80 ఇళ్లకు 45 ఇళ్లు పూర్తిగా నేలమట్టం అయిపోయాయి. పంట పొలాలన్నీ సర్వనాశనం అయిపోయాయి. దెబ్బతిన్న కుటుంబాలను ఆదుకుంటామంటూ ప్రభుత్వం చెప్పిన మాటలు వట్టి మాటలుగానే మిగిలిపోయాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో వేలేరుపాడు మండలంలో 16 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా తెలంగాణ భూభాగంలో 2,360 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాజెక్టు ఖర్చులను ఎపి 80 శాతం తెలంగాణ 20 శాతం భరిస్తున్నాయి. గండిపడిన ప్రాజెక్టును నిర్మించేందుకు రూ.19.20 కోట్లు అవుతుందని అంచనా వేసినా ఇప్పటికీ పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంది. రింగుబండ్ పనులు చేసినప్పటికీ గత నెలలో వచ్చిన గోదావరి వరదల నేపథ్యంలో అది కొట్టుకుపోయింది. పెదవాగు ప్రాజెక్టుకు వరద వస్తుండటంతో గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అక్కడి ప్రజలు వణికిపోతున్నారు. వరద నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ తెలిపారు. శనివారం రాత్రికి కొంతమేర వరద ఉధృతి తగ్గినట్లు చెబుతున్నా పరిస్థితి ఏ క్షణం ఎలా ఉంటుందోనన్న భయం అందర్నీ వెంటాడుతుంది. గండి పడిన ప్రాజెక్టు పనులు పూర్తయి ఉంటే ప్రమాదం గురించి అంత ఆందోళన చెందాల్సిన అవసరం ఉండేది కాదు.

# వర్షం.. రోడ్లు జలమయం

పొంగి ప్రవహించిన కొండ వాగులు - ప్రజల అవస్థలు

బుట్టాయగూడెం : ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఏలూరు జిల్లాలో పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఏలూరు నగరంలో శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పవర్ పేట స్టేషన్ రోడ్డు, ఆర్ఆర్.పేట రోడ్లు జలమయమయ్యాయి. వన్‌టౌన్ సత్యనారాయణ థియేటర్ వద్ద రోడ్లపై గోతులు వర్షపు నీటితో మునిగిపోయాయి. దీంతో ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


పోలవరం : ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

**పోలవరంలో పొంగిన కొండవాగులు**

**పోలవరం** : అల్పపీడన ప్రభావంతో పోలవరంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పోలవరం మండలంలో జిల్లెల్లగూడెం, గుంజవరం, కొవ్వాడ కాలువ కొండవాగులు పొంగి ప్రవహించాయి. శనివారం కురిసిన వర్షానికి చెగొండపల్లి, రేపల్లెవాడ మధ్య ఉన్న కొవ్వాడ కాలువ పొంగి రహదారులపైకి రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కొండవాగుల జలాలు కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ 23 గేట్ల నుంచి గోదావరిలోకి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం, గూటాల వరకు నాలుగు పంచాయతీల్లో ఏటిగట్టుకు దిగువన ఉన్న నివాసాల్లోకి వర్షపు నీరు చేరి ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు. కమ్మరగూడెంలో రోడ్ల మీద నిలిచిన వర్షపు నీరు చెరువులను తలపించింది. పోలవరం మెయిన్ బజార్‌లో వర్షపు నీరు నిలిచి కొనుగోలుదారులు ఇబ్బందులకు గురయ్యారు.

**బుట్టాయగూడెం** : మండలంలో కురిసిన భారీ వర్షానికి ఇప్పలపాడు సమీపంలోని జల్లేరు వాగు, రెడ్డి గణపవరం లోని జల్లేరు వాగు, కెఆర్.పురంలోని కొండవాగులు ఉధృతంగా ప్రవహించాయి. కాజ్‌వేలపై నుంచి ఉధృతంగా కొండవాగుల ద్వారా వచ్చిన నీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మార్గం మధ్యలో ఈ కొండ వాగులు ఉండడం వల్ల ప్రజలు రాత్రి పది గంటల వరకు తమ తమ ఇళ్లకు చేరుకోలేదు. బుట్టాయగూడెం పోలీస్ సిబ్బంది ఈ కాజ్‌వేల వద్ద బారికేడ్లు పెట్టి ప్రజలను కొండవాగులో దిగనియ్యకుండా కాపలా కాశారు.

**ముదినేపల్లి** : ముదినేపల్లిలో శనివారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం 11 గంటలకు మొదలైన వర్షం మూడు గంటల వరకు పడుతూనే ఉంది. సుమారు నాలుగు గంటల పాటు కురిసిన వర్షంతో ముదినేపల్లి సెంటర్ జలమయమైంది. భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో పాదచారులు, ద్విచక్ర వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి వస్తు సామగ్రి తడిసిపోయాయి. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయం కావడంతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా యాతన పడ్డారు. అలేఖ్య విలాస్‌లో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

**నూజివీడు టౌన్** : భారీ వర్షానికి పట్టణంలో పలు రోడ్లు జలమయమయ్యాయి. బస్టాండ్ సెంటర్, జంక్షన్ రోడ్డులోని మొగల్ చెరువు, బిస్మిల్లా హోటల్ సెంటర్ వద్ద రోడ్లు చెరువును తలపించాయి. యనమదుల గ్రామపంచాయతీ శివారు రేగుంట గ్రామంలో రోడ్లపై నీరు ప్రవహించింది. కృష్ణా జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## కొండవాగులో ఇద్దరు మహిళా కూలీలు గల్లంతు

గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

**జీలుగుమిల్లి** పత్తి చేలో పనికి వెళ్లిన ఇద్దరు మహిళలు అకస్మాత్తుగా పెరిగిన వరద ఉధృతికి గల్లంతైన ఘటన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంత సమీపంలోని చెన్నాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పూచికపాడు గ్రామానికి చెందిన ఎనిమిది మంది కూలీలు తెలంగాణ రాష్ట్రం కావడి గుండ్ల పంచాయతీ చెన్నాపురం సమీపంలో పత్తి చేలో పనికి వెళ్లారు. ఎగువన భారీ వర్షం కురవడంతో గోపన్నగూడెం - కావడిగుండ్ల మధ్య కొండ వాగు ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించి రహదారిపై నుంచి వెళ్తుంది. దీంతో నలుగురు కూలీలు రోడ్డు దాటుతుంటగా వారిలో పాలడుగుల చెన్నమ్మ(50), పచ్చితాళ వరలక్ష్మి(55) ఉధృతికి గల్లంతయ్యారు. తెలంగాణ పోలీసులు, జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ క్రాంతికుమార్‌లు ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు.

# గోదావరికి మళ్లీ వరద

నీట మునిగిన గుండేటి, ఎద్దు వాగు కాజ్‌వేలు

27 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గోదావరికి మళ్లీ వరద తాకిడి ప్రారంభమైంది. సుమారు నెల రోజులపాటు వరద పెరుగుతూ, తగ్గుతూ మండలంలోని ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన గోదావరి వరద పూర్తిగా తగ్గి వారం రోజులు గడవకముందే మళ్లీ నేనొస్తున్నా అంటూ గోదావరికి వరద తాకిడి ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతుండటంతో గోదావరికి వరద క్రమంగా పెరుగుతుంది. భద్రాచలంలో 32 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వారం రోజుల క్రితం వరద తగ్గడంతో మిర్చి సాగుకు సమాయత్తమైన రైతులు మళ్లీ వరద వస్తుండటంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

**వేలేరుపాడు రూరల్:** గోదావరికి మళ్లీ వరద రావడంతో ఎడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్‌వే శనివారం నీట మునిగింది. దీంతో కోయిదా, కట్కూరు, టేకూరు, యడవల్లి తదితర సుమారు 15 గ్రామాలకు మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికే రెండు నెలలుగా గోదావరి వరదతో తల్లడిల్లిన ప్రజలు వారం రోజులుగా వరద తగ్గి రాకపోకలు ప్రారంభం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే మళ్లీ వరద ముంచెత్తడంతో ఆయా గ్రామాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పోలవరం:** గోదావరి ఉపనదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, ఇంద్రావతి పొంగి గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. శనివారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. పోలవరం నుంచి 4,35,010 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 29.700 మీటర్లు, స్పిల్వే దిగువన 20.300 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 30.050 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 19.800 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల మధ్య 16.070 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

# మహోన్నత వ్యక్తి పాతూరి వెంకటేశ్వరరావు

వర్ధంతి కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు కేశవరావు

నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కమ్యూనిస్టు ఆశయాల సాధన కోసం, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిన పాతూరి వెంకటేశ్వరరావు మహోన్నత వ్యక్తి పాతూరి వెంకటేశ్వరరావు అని ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు అన్నారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని సుందరయ్య నగర్‌లో ఉన్న పాతూరి వెంకటేశ్వరరావు స్థూపం వద్ద ఆయన 19వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య నిలయంలో పాతూరి వెంకటేశ్వరరావు వర్ధంతిని నిర్వహించారు. పాతూరి వెంకటేశ్వరరావు కుమారుడు రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బిఆర్. తులసీరావు, ఎస్‌కె.జహాంగీర్ భాషా, ఎం.రాజారావు, ఎం.నరేష్, ఎస్.కోటేశ్వరరావు, ఆర్.చంటి, సిపిఐ నాయకులు సిహెచ్. రామారావు, ఎన్. నరసింహా, సిపిఐ (ఎం) లిబరేషన్ నాయకులు హర నాథ్, టిడిపి నాయకులు ఎస్.రమేష్, ఎం. గోపాల్, కాంగ్రెస్ నాయకులు రవికుమార్, పి.సాగర్ కుమార్, వైసిపి నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెక్కులు అందిస్తున్న మంత్రి పార్థసారథి

## నిరుపేదల వైద్యానికి చేయూత సిఎంఆర్ఎఫ్

### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నిరుపేదల మెరుగైన వైద్యానికి చేయూత సిఎం సహాయనిధి అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సుమారు రూ.24,49,511 లక్షల విలువైన సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందించారు. నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలంలో 17 కుటుంబాలకు సుమారు రూ.6,99,041 లక్షలు, ఆగిరిపల్లి మండలంలో ఆరు కుటుంబాలకు రూ.1,95,152 లక్షలు, ముసునూరు మండలంలో ఏడు కుటుంబాలకు రూ,3,15,132 లక్షలు, నూజివీడు మండలంలో ఆరు కుటుంబాలకు రూ.3,97,473 లక్షలు, నూజివీడు పట్టణానికి చెందిన ఎనిమిది కుటుంబాలకు రూ.5,28,678 లక్షలు, ఇతర ప్రాంతాలకు చెందిన ఎనిమిది కుటుంబాలకు రూ.3,14,035 లక్షలు మొత్తం 52 కుటుంబాలకు సుమారు రూ.24.49.511లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో వైద్యం చేయించుకున్న బిల్లులను సిఎం సహాయ నిధికి అర్జీ చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఏడాదిలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన సంవత్సర కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక కిలో బియ్యం రూ.35 కొనుగోలు చేసి నిరుపేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం సుమారు రూ.14 లక్షల కోట్ల అప్పుల చేసి రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందన్నారు. రాష్ట్రంలోయూరియా కొరత లేకపోయినా ఉన్నట్లు ప్రతిపక్ష పార్టీ తప్పుడు ప్రసారం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమం చూసి ఓర్వలేక తప్పుడు ప్రసారం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీకి పొగాకు, పామాయిల్ రైతుల అభినందనలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అదనపు పొగాకు కొనుగోళ్లకు కేంద్రం నుంచి అనుమతులు సాధించిన ఎంపీకి రైతులు అభినందనలు తెలిపారు. ఎంపీని ఏలూరు శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో పొగాకు, పామాయిల్ రైతులు శనివారం కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు చొరవతో రైతుల సమస్యలను కేంద్రం ముందు ఉంచామన్నారు. ఆయిల్ పామ్ గురించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురాగలిగామని, తాజాగా పామాయిల్ గెలలకు మంచి ధర లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా పొగాకు, పామాయిల్ రైతులు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.

## ఎర్రచెరువు పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురంలోని ఎర్రచెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్న నిరుపేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందించినట్లు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎర్రచెరువు కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు 2014 నుంచి 2019 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై నిర్మాణాలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. వారికి గత వైసిఎ ప్రభుత్వం బిల్లులు నిలుపుదల చేసిందని తెలిపారు. నేటికి ఇంటి బిల్లులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న కొండపల్లి రవి

## ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను హైదరాబాదులో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తన పట్ల ఉన్న విశ్వాసానికి, చూపిస్తున్న ఆదరాభిమానులు ఎప్పటికీ మరిచిపోలేనని, ప్రజల విశ్వాసాలను ఆశలను కార్యరూపంలో చూపించడమే తన ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రముఖులు, వ్యాపార వేత్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖులు

## డిఎస్‌సి ఉద్యోగం సాధించినవారికి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిఎస్‌సి ఉద్యోగం సాధించిన విద్యార్థులకు సిఆర్.రెడ్డి కళాశాల ఆడిటోరియంలో శనివారం అభినందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా నందమూరి తారకరామారావు, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చింతమనేని మాట్లాడుతూ డిఎస్‌సి నోటిఫికేషన్ పడిన తర్వాత 120 రోజుల పాటు విద్యార్థులకు కోచింగ్ ఇచ్చామని, అందులో 38 మంది విద్యార్థులు ఉద్యోగం సాధించారని చెప్పారు. డిఎస్‌సి కోచింగ్‌కు సహకరించిన రైస్ మిల్లర్ అసోసియేషన్ వారిని అభినందించారు. అనంతరం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్, డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, ఏలూరు ఎంఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, దెందులూరు ఎఎంసి ఛైర్మన్ రామసీత, తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణమూర్తి మృతి తీరని లోటు

### బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణానికి చెందిన అడ్వకేట్, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది టి.సత్యనారాయణమూర్తి(55) శనివారం ఉదయం గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందినట్లు పలువురు న్యాయమూర్తులు తెలిపారు. ఆయన మృతి బార్ అసోసియేషన్‌కు తీరని లోటని అడ్వకేట్, బార్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సత్యనారాయణమూర్తి మృతి పట్ల జంగారెడ్డిగూడెం కోర్టు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, గుమస్తాలు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సత్యనారాయణమూర్తి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# వీధి దీపాలు వెలిగించండి మహాప్రభో

**అంధకారంలో పలు గ్రామాలు**
**ప్రజల అవస్థలు**
**పట్టించుకోని అధికారులు**

ప్రజాశక్తి - ముదినేపల్లి

వీధి దీపాలు పాడై నెలలు గడుస్తున్నా పంచాయతీ పట్టించుకోకపోవడంపై మండలంలోని బొమ్మినంపాడు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బొమ్మినంపాడు ప్రధాన గ్రామంలో వీధిలైట్లు పాడై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణాలు చేసి రాత్రి వేళ ఇళ్లకు వచ్చే ప్రజలు, ముఖ్యంగా మహిళలు రహదారి అంతా చీకటి మయంగా మారడంతో భయపడుతున్నారు. దీనికి తోడు రాత్రి వేళల్లో పాముల సంచారం కూడా అధికంగా ఉండడంతో కర్రలు పట్టుకుని పురుషులు బస్సు దగ్గరికి వెళ్లి మహిళలను ఇంటికి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు. పలుసార్లు ఈ విషయమై పంచాయతీ పాలక వర్గానికి విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే పరిస్థితి మరింత భయానకంగా ఉందని, వెంటనే పంచాయతీ కార్యదర్శి స్పందించి పాడైన వీధి దీపాల స్థానంలో నూతన వీధి దీపాలు ఏర్పాటుచేసి ప్రజల చీకటి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**అంధకారంలో అలేఖ్య విల్లాస్**

పెయ్యేరు పంచాయతీ శివారు అలేఖ్య వెంచర్‌లోని కొన్ని కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం లేదు. కొన్ని ప్రాంతాల్లో వీధి స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ సౌకర్యం లేక ఆ ప్రాంతమంతా అంధకారంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవటం లేదని అలేఖ్య విలాస్ నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఇటీవల పంచాయతీపై విచారణకు వచ్చిన డిఎల్‌పిఒ అమ్మాజీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా కార్యదర్శి నేటికీ విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడం వల్ల అలేఖ్య విలాస్ నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలు అంధకారంలో ఉండడంతో విషసర్పాలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటిపూట కూడా విషసర్పాలు వెంచర్‌లో తిరగడంతో పిల్లలను స్కూల్ పంపాలంటే భయమేస్తుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. సర్పంచికి, కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని, వీధి దీపాలు ఏర్పాటు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెయ్యేరు అలేఖ్య విల్లాస్‌లో వెలగని వీధి దీపాలు

**తేరగూడెంలో...**

పేరూరు పంచాయతీ శివారు తేరగూడెంలో కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ గ్రామం అంతా అంధకారంగా ఉంటుంది. వీధి దీపాలు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ బయటకు రావాలంటేనే భయమేస్తుందంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు పంచాయతీకి, పాలకవర్గానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ కార్యదర్శిపై, పంచాయతీ పాలకవర్గంపై గ్రామస్తులు దుమ్మెత్తి పోస్తున్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు నిర్మించాలి

**సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి**
**ఎంపీ మహేష్ కుమార్‌కు రైతుల వినతి**

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు నిర్మించాలని, ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎపి రైతుసంఘం, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. శనివారం ఏలూరు ఎంపీ కార్యాలయంలో వినతిపత్రం అందించిన రైతులు మాట్లాడుతూ సర్వేస్ రోడ్లు నిర్మించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, దేవరపల్లి సత్యనారాయణ, వందనపు సాయిబాబా, గోలి నర్సిరెడ్డి మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే చింతలపూడి, టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల మీదుగా 31 గ్రామాల నుంచి వెళ్తుందన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ లేదని, రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద చెట్లు పెంచుతారని, వాటి బాగోగులకు అటు, ఇటు మట్టి రోడ్డు ఉంటుందని, దాన్ని గ్రావెల్ రోడ్డుగా మార్చి రైతులకు ఉపయోగకరంగా తీసుకొస్తామని గతంలో హామీ ఇచ్చారని చెప్పారు. అయితే ప్రస్తుతం మట్టి రోడ్డు కూడా రైతులకు అందుబాటులో లేదన్నారు. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించకపోవడంతో చాలాచోట్ల రైతుల తమ పొలాలకు వెళ్లే మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల మధ్య రహదారులు మూసుకుపోయాయని చెప్పారు. దీనివల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక అండర్ పాస్ నుండి మరో అండర్ పాస్‌కు వెళ్లేలా అనుసంధానం చేస్తూ సర్వీస్ రోడ్లు నిర్మించాలని కోరారు. తగినంత ఎత్తు, వెడల్పుతో అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణం జరగలేదన్నారు. వరి కోత మిషన్లు, లోడ్ చేసిన పామాయిల్ గెలల ట్రాక్టర్లు, ఇతర పంటలు తీసుకెళ్లే వాహనాలు అండర్ పాస్‌ల నుండి వెళ్లే అవకాశం లేకుండాపోయిందన్నారు. సర్వీస్ రోడ్డు మట్టి రోడ్డు కావడంతో ట్రాక్టర్లు లారీలు మట్టిలో కూరుకుపోతున్నాయన్నారు. అన్ని అండర్ పాస్‌లను కలుపుతూ సర్వీస్ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ మహేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్ల సమస్యపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

వినతిపత్రం అందిస్తున్న నేతలు

# త్రిసభ్య కమిటీలు మెరుగైన సేవలందించాలి

**ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్, చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్**

ప్రజాశక్తి - చింతలపూడి

నూతనంగా ఎన్నికైన త్రిసభ్య కమిటీలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యులకు మెరుగైన సేవలందించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం నిర్వహించిన చింతలపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ, యర్రంపల్లి సొసైటీ చైర్ పర్సన్ తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత ఫాతిమాపురం గ్రామం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ నిధుల నుంచి రూ.రెండు కోట్లు ప్రగడవరం పంచాయతీకి ఇస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పామాయిల్ రైతులకు, కోకో, పొగాకు రైతులకు మద్దతు ధర కల్పించామన్నారు. రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. సొసైటీలను లాభాల బాటలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. యూరియా కొరత చింతలపూడి నియోజకవర్గంలో లేదన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, గన్ని వీరాంజనేయులు ఎప్పటికప్పుడు యూరియా కొరత లేకుండా చూస్తున్నారన్నారు. అవసరం మేరకే యూరియా వాడాలని సూచించారు. కూటమి ప్రభుత్వం కేవలం ఎరువుల సమస్యకే కాకుండా రైతుల సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుకెళ్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ మహేష్

## బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమకు బకాయిలను తక్షణం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.కామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కెనాల్ రోడ్డులో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కామయ్య మాట్లాడారు. 2020 నుంచి ఇప్పటివరకు 550 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారని, వీరికి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, అరియర్స్ నేటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 65 మంది విశ్రాంత ఉద్యోగులు తమ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పొందకుండానే చనిపోయారని తెలిపారు. 2014 నుంచి మెడికల్ బిల్లులు నేటికీ చెల్లించలేదని విమర్శించారు. డిఎ బకాయిలు 2018 నుంచి 2021 వరకు చెల్లించలేదని, ఎర్న్ లీవ్స్, ఫైనల్ సెటిల్‌మెంట్, గత ఆరేళ్లుగా చెల్లించలేదన్నారు. రిటైర్ అయిన 550 మంది ఉద్యోగులకు ఎంత మొత్తంలో బెనిఫిట్స్, అరియర్స్ చెల్లించాలో రాష్ట్ర ప్రధాన కార్యాలయం వద్ద సరైన సమాచారం కూడా లేదన్నారు. నిధులు, బడ్జెట్ ఉన్న రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా మంజూరుకు నోచుకోలేదని తెలిపారు. వారి నిర్లక్ష్యం కారణంగా మంజూరైన బడ్జెట్‌ను వినియోగించుకోలేని స్థితిలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారని విమర్శించారు. ఒకవేళ నిధులు లేకపోతే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలనే ఆలోచన లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తక్షణం తమ సమస్యలపై దృష్టి సారించి రిటైర్ ఉద్యోగుల హక్కులను రక్షించడానికి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాల ద్వారా పోరాటానికి సిద్ధం అవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజలు కష్టాల్లో ఉంటే వారి సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే వ్యక్తి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అని టిడిపి నగర పంచాయతీ అధ్యక్షులు తాటి అప్పారావు, టిడిపి ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. నగర పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్ వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత చింతలపూడి మెరక ప్రాంతంలో ఉన్న కాలనీకి నీరు అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడే వారన్నారు. ఈ సమస్యను చింతలపూడి ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లగా ముందుగా ట్యాంకర్లతో నీటిని అందించి ప్రజల దాహార్తి తీర్చాలని అధికారులను ఆదేశించారని, అంతే కాకుండా తాగునీటి బోరుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. నగర పంచాయతీలో బడ్జెట్ లేకపోయినప్పటికీ ఆయనే స్వయంగా దాతలతో మాట్లాడి దాతల సహకారంతో వెంటనే అధికారులను అప్రమత్తం చేసి తాగునీటి బోరు వేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్, ఎస్‌సి సెల్ టౌన్ అధ్యక్షులు కర్లపూడి రాజారత్నం పాల్గొని మాట్లాడారు.

## రాజ్‌న్యూస్ తెలుగు బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు కృష్ణ ఎంపిక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణానికి చెందిన యువ చార్టర్డ్ అకౌంటెంట్, సామాజికవేత్త దాకారపు కృష్ణ ప్రతిష్టాత్మక రాజ్‌న్యూస్ తెలుగు బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు 2025కు ఎంపికయ్యారు. విజయవాడ ఎ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే రాజ్ న్యూస్ తెలుగు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025 పురస్కార ప్రదాన కార్యక్రమంలో విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ప్రతి ఏడాది వివిధ రంగాలు, అంశాల్లో తమదైన రీతిలో సమాజానికి విలువైన సమయం, సేవను అందిస్తున్న ప్రముఖులను గుర్తించి పురస్కారం అందించి వారి స్ఫూర్తిని విస్తృత సమాజానికి పరిచయం చేస్తూ, భావితరాలకు ప్రేరణాత్మక మార్గనిర్దేశం చేసే క్రమంలో వారి విశిష్ట సేవలతో సామాజిక ప్రభావాన్ని గౌరవిస్తూ విశిష్ట సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాజ్ న్యూస్ తెలుగు ప్రతినిధులు ప్రకటించి ఈ మేరకు దాకారపు కృష్ణకు ఆహ్వానం పంపారు. దాకారపు కృష్ణ సామాజిక సేవలో రోటరీ జంగారెడ్డిగూడెం వేదికగా 2020-23 వరకు మూడు సంవత్సరాలు అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. కృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు.



## ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బొలెరో అందజేత

ఎస్‌పికి వాహనం అందిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు పరిశ్రమించే పోలీసులు మరింత సమర్థవంతంగా అత్యవసర సేవలందించేందుకు వీలుగా దాతలు వాహనాన్ని అందించడం ఎంతో అభినందనీయమనీ ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ప్రశంసించారు. పోలీసులకు అవసరమైన వాహనాన్ని అందించేందుకు పలువురు దాతలు ముందుకొచ్చారు. ఎంఎల్ఎ బడేటి చంటి పిలుపు మేరకు గుప్తా ఫౌండేషన్‌తో పాటు మరికొందరు దాతలు ముందుకొచ్చి ఏలూరు ట్రాఫిక్ పోలీసులకు అవసరమైన బొలెరో వాహనాన్ని సమకూర్చగా ఆ వాహనాన్ని ఎంఎల్ఎ బడేటి చంటి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌కు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, జిల్లా అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్ కుమార్, ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు, గుప్తా ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్, నాయకులు బెల్లపుకొండ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరంతరం పని ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరమని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర అన్నారు. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు గుండె వైద్య పరీక్షల శిబిరం వేగవరం వద్ద డాక్టర్ వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం ఎపియుడబ్ల్యూజె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిఎస్‌పి యు.రవిచంద్ర ప్రారంభించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.వేణు జర్నలిస్టులకు వైద్య పరీక్షలు చేసి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ, సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, డాక్టర్ వేణు హాస్పిటల్ ప్రతినిధులు నరేంద్ర, రాజశేఖర్, ఎపియుడబ్ల్యూజె నాయకులు డివి.భాస్కరరావు, కెవి.రమణారావు, కె.వెంకట్, సీనియర్ జర్నలిస్టులు వి.శ్రీనివాస్, సురేష్, పి.సాయికుమార్, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, నండూరి కిషోర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 40 మంది హెచ్ఐవి, ఎయిడ్స్ బాధిత బాల బాలికలకు ఒక నెలపాటు సరిపడే పౌష్టికాహార కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం 40 మంది హెచ్ఐవి బాధిత బాల, బాలికలకు నెలకు సరిపడా పౌష్టికాహారాన్ని రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, పెన్మత్స శ్రీరామరాజు, ఎంవివిఎస్.నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పోషకాహారం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, హెచ్ఐవి బాధితుల ఆరోగ్యం మెరుగుపడేందుకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, మేతర అజయ్‌బాబు, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఏలూరు మానవత ప్రెసిడెంట్ ఎంఎస్ఎంఎస్.కుమార్, ఎ.నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## పలుచోట్ల జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వేదికగా న్యాయమూర్తి శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం నాలుగు గంటల వరకు 53 క్రిమినల్, పది సివిల్, ఐదు ఎంసి, ఏడు చెక్కు కేసులు పరిష్కారమయ్యాయని కోర్టు అధికారులు తెలిపారు. భీమడోలు బార్ అసోసియేషన్ సహకారాన్ని అందించారు.

పట్టణంలోని కోర్టు భవనంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కేసులతో సమయం, డబ్బు వృధా అవుతుందని హెచ్చరించారు.

## మహిళలకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

నేటి సమాజంలో ఆడపిల్లలు లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, అంతర్గత విభేదాలు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచి కొండేటి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని స్థానిక గ్రామపంచాయతీ పరిధిలో రక్షణ సైన్యం చర్చి వారి ఆధ్వర్యంలో ఆడపిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాట్రేనిపాడు, గోపవరం, పెద్దపాటి వారిగూడెం, ముసునూరు, చింతలవల్లి గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

## 15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశు వైద్య శాల పరిధిలో ఉన్న జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు 30 రోజుల పాటు నిర్వహించనున్నట్లు డాక్టర్ శేఖర్‌దొర తెలిపారు. మూడు నెలల వయస్సు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. వైరస్ వల్ల వచ్చే వ్యాధి వల్ల పశువు నోటి చిగుళ్ల మీద పుండ్లు, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి అధిక జ్వరం(106 డిగ్రీల వరకు) వచ్చి పాలిచ్చే పశువులకు పాల దిగుబడి ఆకస్మాతుగా తగ్గిపోతుందన్నారు. పనిచేసే పశువులైతే నీరశించి పని చేయక రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. రైతులు ప్రతి ఆరు నెలలకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు వేయించాలని సూచించారు.

**భీమడోలు :** పశువుల్లో గాలి కుంటు వ్యాధి నివారణకు ముందస్తు టీకాలు వేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ చేపట్టిందని భీమడోలు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఇకుర్తి సాయి రమేష్ తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీ నుంచి కార్యక్రమాన్ని జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు భీమడోలులోని తన కార్యాలయంలో గోడపత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ సహాయకులు జె.హరికృష్ణ, డిఇఒ చలపతిరావు, ఒఎస్.కృష్ణ పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి :**జాతీయ పశురోగ నివారణ కార్యక్రమంలో భాగంగా పశువులకు గాలి కుంటువ్యాధి సోకకుండ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయిబుచ్చారావు తెలిపారు. ఈ టీకాలు సెప్టెంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు మండలంలోని అన్ని సచివాలయల పరిధిలోని గ్రామాల్లో పశు వైద్య సిబ్బంది అధ్వర్యంలో పశువులకు టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. వ్యాధి సోకకుండా పశువులకు ముందుగానే టీకాలను వేయించుకోవాలని పాడి రైతులకు సూచించారు.

**పాస్‌పోర్టు పోయినది**

నక్కా రాధా కుమారి, తండ్రి: దేవ మాషెన్ రావు, డోర్ నెంబర్ 10-63, పైడావ దుర్గమ్మ చెరువు గుమ్మలూరు, పోడూరు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి ది 20-06-2017 న R2775605 నెంబర్ పాస్ పోర్ట్ పొంది యున్నాను. నేను ది 5-9-2025న మా ఇంటి నుంచి పెనుమదం సెంటర్‌లో నా ఒరిజినల్ పాస్ పోర్ట్‌తో జెరాక్స్ కాపీలు తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో పడి పోయినవి. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 8790223825

**పబ్లిక్ నోటీసు**

నా క్లయింటున్నూ కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు పట్టణం, డి.ఎ.ఆర్. కాలేజ్ దగ్గర, డోరునెం.20-207లో నివాసం వుంటున్న మేకా రాజగోపాల్ గారి కుమార్తె మేకా ఇందువర్ష, వయస్సు 33 లు, ఆధార్ నెం.3369 6642 8557, నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా : - నా క్లయింటు నూజివీడు పట్టణ కాపురస్తులు అయివున్నారు. నా క్లయింటుకు X7371706 అను నెంబరు పాస్‌పోర్టు కలదు. ఇట్లుండగా ది.11-09-2025వ తేదీన ఉదయం సుమారు గం.10.30 ని॥ల సమయంలో సదరు పైతెలిపిన ఒరిజినల్ పాస్‌పోర్టును కవరులో పెట్టుకొని నా క్లయింటు చిన్నగాంధీ బొమ్మ సెంటరులో గల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళగా, దారి మధ్యలో సదరు పాసుపోర్టు పెట్టిన కవరు ఎక్కడో జారి క్రింద పడిపోయినది. దానిపై నా క్లయింటు వచ్చిన దారిలో మరియు ఆ చుట్టు ప్రక్కల వెతికి చూసినప్పటికీ సదరు ఒరిజినల్ పాస్‌పోర్టు కనపడియుండలేదు. కావున పై తెలిపిన ఒరిజినల్ పాస్‌పోర్టు ఎవరికైననూ దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేయగలరు. పాస్‌పోర్టు యిచ్చిన వారికి తగిన పారితోషికం యివ్వబడును.

ఇందుపల్లి సత్యప్రకాష్,
న్యాయవాది,నూజివీడు
సెల్: 9603034999